సాక్షి
కరీంనగర్
ఆదివారం | 5 | మే | 2024



ఎండవేడి.. ఉక్కపోత

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భానుడి ప్రతాపం కొనసాగుతోంది. శనివారం సైతం ప్రచండ భానుడిగా తన ప్రకోపాన్ని చూపాడు. ఉదయం తొమ్మిదిదాటక ముందే నిప్పులు కక్కుతున్నాడు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. తీవ్రమైన వడగాలులు వీచాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతుండగా.. ప్రజలు కూలర్లు, ఏసీల కింద సేదతీరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో శనివారం అత్యధిక డిగ్రీల సెల్సియస్ నమోదైన ప్రాంతాలు

అల్లీపూర్(జగిత్యాల)	46.8
వీణవంక(కరీంనగర్)	46.8
పెద్దపల్లి	46.1
రాజన్న సిరిసిల్ల	45.3

పోలింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

- కలెక్టర్ పమేలా సత్పతి



ట్రాన్స్‌జెండర్ పెట్టిన గోరింటాకుతో కలెక్టర్

కరీంనగర్ అర్బన్: పోలింగ్ రోజు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మోడల్ పోలింగ్ స్టేషన్లు, దివ్యాంగులు, వయోవృద్ధులకు చేపట్టాల్సిన ప్రత్యేక ఏర్పాట్లపై శనివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో సమీక్షించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్లో వీల్ చైర్ అందుబాటులో ఉంచాలని సూచించారు. పార్లమెంట్ పరిధిలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదు మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ ఆయాలకు టీషర్టులు అందించారు.

పోలింగ్ వందశాతం జరిగేలా చర్యలు

పార్లమెంట్‌పరిధిలో ట్రాన్స్‌జెండర్లు 100శాతం ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. నగరంలోని స్వశక్తి కళాశాలలో ట్రాన్స్‌జెండర్లతో సమావేశమయ్యారు. ఓటుహక్కు వినియోగించుకునేలా ట్రాన్స్‌జెండర్లు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర పరస్పర సహాయ సహకార జిల్లా సమాఖ్య ప్రతినిధులతో సమావేశమయ్యారు. గ్రామాలు, పట్టణాల్లో ఓటింగ్ పెరిగేలా స్వశక్తి మహిళలు, మెప్మా సిబ్బంది పని చేయాలన్నారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్డీవో శ్రీధర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతీ, డీపీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఉన్నారు.

టెన్త్ సర్టిఫికెట్ కీలకం

హుజూరాబాద్: టెన్త్‌లో ఫెయిల్ అయ్యామని చదవడం మానేస్తే అక్కడే ఆగిపోతారని, కష్టపడి చదివితే ముందుకెళ్తారని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జీవితంలో టెన్త్‌సర్టిఫికేట్ కీలక డాక్యుమెంట్ అని పేర్కొన్నారు. హుజూరాబాద్‌లోని మైనార్టీ స్కూల్లో శనివారం 10వ తరగతి ఫెయిలైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం అయ్యారు. పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. డీఈవో జనార్దన్ రావు, అసిస్టెంట్ కమిషనర్ నరసింహస్వామి, ఆర్డీవో రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ పరిశీలన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాకలో జరుగుతున్న హోంఓటింగ్‌ను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. హోంఓటింగ్‌లో పాల్గొన్న వృద్ధులతో మాట్లాడారు. ఇంటివద్దకే ఓటు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవ్వండి.. నవ్వించండి

నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

- వివరాలు II లో



ఎంపీ అభ్యర్థులూ.. వినండి మా గోడు!




బాజిరెడ్డి గోవర్దన్





బండి సంజయ్ కుమార్



జీవన్‌రెడ్డి



బి. వినోద్‌కుమార్



ధర్మపురి అర్వింద్



గడ్డం వంశీకృష్ణ



కొప్పుల ఈశ్వర్



గోమాస శ్రీనివాస్



వెలిచాల రాజేందర్‌రావు

- మూడు ఎంపీ నియోజకవర్గాల్లో కానరాని ఈఎస్ఐ ఆస్పత్రి
- బీడీ, గ్రానైట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సేవలు దూరం
- ఆన్ డిమాండ్ అంగన్‌వాడీ సెంటర్లకు ప్రతిపాదనలేవి?
- ఊసే లేని మైనార్టీ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ 13 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ నియోజకవర్గాలతో భారీగా జనాభా ఉన్న సువిశాలమైన జిల్లా. ఇంతటి జనాభా ఉన్న పాత జిల్లాలో సామాన్యులు చట్టప్రకారం అందాల్సిన కనీస సదుపాయాలకు నోచుకోలేకపోతున్నారు. సామాజికపరంగా భద్రత కల్పించే అనేక రకాల సదుపాయాలను వివిధ సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికుల కోసం కేంద్రం ప్రవేశపెట్టింది. ఇంతవరకూ ఆ సేవలు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పరిధిలో ఉన్న 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో అందడం లేదు. కొన్ని సేవలు నేటికీ అసంపూర్తిగానే అందుతున్నాయి. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోటీచేసే అభ్యర్థులు గెలిచాక ఆయా సమస్యలకు ఈ సారైనా పరిష్కారం చూపిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈఎస్ఐ సేవలెక్కడ?

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా మూడు రంగాల్లో కార్మికులు పనిచేస్తున్నారు. వీరు అనారోగ్యం పాలైతే వైద్యం అందించేందుకు కేంద్రం ఈఎస్ఐ ఆసుపత్రి సేవలు తీసుకొచ్చింది. రామగుండంలో చిన్న డిస్పెన్సరీ తప్ప జనాభాకు తగినట్లు ఇక్కడ ఈఎస్ఐ ఆసుపత్రి లేదు. అసలు ఆ ఆసుపత్రి ఉన్న విషయం కూడా చాలామంది తెలియకపోవడం గమనార్హం. ఈ సేవలు పొందాలంటే వరంగల్, హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 30వేల మంది ప్రైవేటు టీచర్లు వివిధ స్కూళ్లలో పని చేస్తున్నారు. కానీ, వీరిలో 50శాతంపైగా మందికి ఎలాంటి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు లేవు. 1,000 వరకు ఉన్న రైసుమిల్లుల్లో 20వేలకు పైగా కార్మికులు ఉన్నారు. అలాగే దాదాపు లక్షా తొంబై వేల మంది బీడీ కార్మికులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 370 వరకు గ్రానైట్ క్వారీల్లో 25వేల వరకు కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి సరైన పీఎఫ్, ఈఎస్ఐ సేవలు అందడం లేదు.

అంగన్‌వాడీ ప్రతిపాదనలేవి?

- పిల్లలకు సరైన పోషకాహారంతోపాటు అక్షర జ్ఞానాన్ని ప్రసాదించే అంగన్‌వాడీ కేంద్రాలు..పేద, సామాన్యుల పాలిట వరం. మన రాష్ట్రంలో దాదాపు 37,500 కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. వాస్తవానికి పెరుగుతున్న జనాభా, వెలుస్తున్న కొత్త కాలనీలకు అనుగుణంగా కొత్త అంగన్‌వాడీ కేంద్రాలను ఆన్ డిమాండ్ పద్ధతిలో ఏర్పాటు చేయాలని గతంలోనే సుప్రీం కోర్టు చెప్పింది. అయినా, ఈ కేంద్రాల అమలుకు ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు ఆశించినంత స్థాయిలో చొరవ తీసుకోవడం లేదు.
- కేంద్రం ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) కింద ఏర్పాటు చేయాల్సిన నైపుణ్య శిక్షణ కేంద్రాలు మన వద్ద లేకపోవడం గమనార్హం.
- అలాగే 13 నియోజకవర్గాల్లో జరుగుతున్న సివిల్ పనుల్లో 0.1 శాతం మొత్తాన్ని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్)కు జమవుతుంది. ఆ మొత్తాన్ని వివిధ సివిల్ పనుల్లో శిక్షణ ఇచ్చేందుకు గ్రాడ్యుయేట్ ఫినిషింగ్ స్కూల్ కోసం వెచ్చిస్తారు. అలాంటి శిక్షణ కేంద్రం ఉమ్మడి జిల్లాలో ఒక్కటి ఏర్పాటు చేసినా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినవారవుతారు.
- కేంద్రం పరిధిలోని నేషనల్ మైనార్టీస్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో రాష్ట్రం సమన్వయం చేసుకోని కారణంగా ఇక్కడ మైనార్టీలకు సరైన ఆర్థికసాయం అందడం లేదు. మైనార్టీ సంఖ్యను చూసినప్పుడు కరీంనగర్‌లో 1,29,000, పెద్దపల్లిలో 70,000పైగా, నిజామాబాద్‌లో 3,00,00 పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఇందులో ముస్లింలు అధికభాగం ఉండగా, మైనార్టీలు, సిక్కులు తదితరులు మిగిలిన సంఖ్యలో ఉన్నారు. ఈసారి గెలిచే ఎంపీలైనా మైనార్టీల ఆర్థికసాయానికి చొరవ తీసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేతన సవరణతో సేవలకు దూరం

ఆపద కాలంలో కనీసం హైదరాబాద్‌లో అయినా ఈఎస్ఐ సేవలు పొందే వీలుండేది. 2015లో రూ.15,000 ఉన్న వేతన పరిమితిని కేంద్రం రూ.2,1000కు పెంచింది. అప్పటి నుంచి అదే కొనసాగుతోంది. కానీ, ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత కేసీఆర్ ప్రభుత్వం 30శాతం వేతనం పెంచింది. దీంతో చాలామంది కార్మికుల వేతనాలు రూ.21,100 దాటాయన్న కారణంతో ఈఎస్ఐ సేవలకు దూరమయ్యారు. మారుతున్న కాలానికి, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన పరిమితిని రూ.25వేలకు పెంచాలన్న కార్మికుల డిమాండ్ ఇంకా అమలుకు నోచుకోలేదు.

గ్యారంటీలన్నీ అమలు చేస్తాం

- బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుతో కలిసి ప్రచారం

చొప్పదండి/రామడుగు: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలన్నీ అమలు చేస్తుందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి శనివారం రాత్రి చొప్పదండి పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో, రామడుగు మండలకేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రిగా తాను, ఎమ్మెల్యేగా సత్యం పనులు చేయడానికి ఉన్నామని, ఇప్పుడు గాడిదలకు గడ్డేసి ఆవులకు పాలు పిండుదామనుకుంటే రావని ఎద్దేవా చేశారు. స్థానికుడైన రాజేందర్‌రావుకు మద్దతు ఇవ్వాలని కోరారు. కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని, పింఛన్లు రూ.4వేలు చేస్తామని, రుణమాఫీ చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూంలు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని, వారికి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రకటన ఆలస్యమైతే బండి సంజయ్ మొత్తం తనదే అనుకున్నాడని, బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు మాట్లాడుతూ రూ.130 కోట్లతో తీగలగుట్టపల్లి బ్రిడ్జి కూడా పూర్తిచేయని దద్దమ్మ బండి సంజయ్ అని విమర్శించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, రామడుగు ఎంపీపీ జవ్వాజీ హరీశ్, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి, కర్ర సత్యప్రసన్నరెడ్డి, పులి ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అభివృద్ధికి రూ.12వేల కోట్లు

- బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ అభివృద్ధికి రూ.12 వేల కోట్లు కేంద్రం నుంచి తీసుకువచ్చి పనులు చేశానని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. శనివారం కరీంనగర్ సీతారాంపూర్‌లోని ఆర్వీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ప్రజ్ఞాభారతి కరీంనగర్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రగతి పథంలో భారతదేశం' అనే సదస్సుకు బండి సంజయ్ హాజరయ్యారు. కరీంనగర్ ప్రజల పక్షాన పోరాడిందెవరో బేరీజు వేసి ప్రజలకు వివరించాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ సొమ్ముతో కాంగ్రెస్ నేతలు సంతలో పశువుల్లా ఇతర పార్టీల నేతలను, కార్పొరేటర్లను కొంటున్నారని, ఒక్కో కార్పొరేటర్‌కు రూ.20లక్షలు ఇస్తున్నారని ఆరోపించారు. వాళ్ల బ్యాంకు ఖాతాల్లోనే రూ.5 లక్షల చొప్పున జమ చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందినవారు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు.



ప్రగతి పథంలో భారతదేశం బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న బండి సంజయ్

విధ్వంసానికి కేరాఫ్ బీజేపీ, కాంగ్రెస్

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

కరీంనగర్/రామడుగు/గంగాధర: మతోన్మాద ఉపన్యాసాలతో రెచ్చగొట్టే బీజేపీ, అబద్ధాల పునాదిపై గెలిచిన కాంగ్రెస్‌లు విధ్వంసానికి చిరునామాలని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ అన్నారు. శనివారం ఉదయం ప్రెస్‌మీట్, సాయంత్రం రామడుగు మండలం గోపాల్‌రావుపేట, గంగాధర మండలం మధురానగర్ చౌరస్తా, కరీంనగర్ భగత్‌నగర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఫిరాయింపు నేతలతో పార్టీకి ఎలాంటి నష్టం కలగదని తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తలే తమ బలమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కొత్త పథకాలు అమలు చేయడం ఏమోగానీ ఉన్న పథకాలను ఊడ గొడుతుందని పేర్కొన్నారు. గోదావరి నీళ్ల కాపాడుకోవడానికి పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు కావాలని, తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు అవకాశవాదులని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు తిరిగి పోటీచేస్తే ఒక్కరు కూడా గెలవరని అన్నారు. మేయర్ సునీల్‌రావు, జీవీ.రామకృష్ణారావు, రవిశంకర్, చల్లా హరిశంకర్, చల్లా స్వరూపారాణి, పొన్నం అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



జగిత్యాల జిల్లా రాయికల్‌లోని కేశవనగర్‌లో ఈనెల 3వ తేదీన వీధికుక్కల దాడిలో 12 మంది గాయపడ్డారు. కేశవనగర్‌కు చెందిన శ్రీనివాస్, నవీన్, రాజిరెడ్డి, రమేశ్, లక్ష్మి, సత్యనారాయణ, నర్సారెడ్డి, విష్ణు, రాజేశ్వరి, శ్రీలేఖ మరో ఇద్దరిని వీధికుక్కలు కరిచాయి. గాయపడినవారంతా రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.



- ప్రతీ నెల రేబిస్ బారిన పడుతున్నవారు దాదాపు 20 మంది
- 700 మందికి పైగా టీకాలు
- ప్రజలపై విరుచుకుపడుతున్న శునకాలు
- వేసవి నేపథ్యంలో పరిస్థితి మరింత తీవ్రం
- ఏటా పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- జిల్లాలో 2 లక్షలకు పైగా శునకాలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

Sakshi focus

గత 13 నెలల్లో కుక్కకాటు కేసులు **8,417**

2023 ఏప్రిల్	615
మే	621
జూన్	696
జూలై	588
ఆగస్టు	576
సెప్టెంబర్	525
అక్టోబర్	663
నవంబర్	699
డిసెంబర్	668
2024 జనవరి	750
ఫిబ్రవరి	651
మార్చి	789
ఏప్రిల్	576

కరీంనగర్ టౌన్: వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.. గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పాదచారులు, వాహనదారులపై విరుచుకుపడుతున్నాయి.. సహజంగానే వేసవిలో శునకాలు వెర్రిగా ప్రవర్తిస్తూ ప్రజలను కరుస్తుంటాయి.. కరీంనగర్ జిల్లాలో వాటి సంఖ్య 2 లక్షలకు పైగా ఉన్నట్లు అంచనా. ప్రతీరోజు పదుల సంఖ్యలో బాధితులు కుక్కకాటుకు గురై, చికిత్స కోసం ఆస్పత్రులకు వస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను పూర్తిస్థాయిలో చేయకపోవడంతో వాటి సంఖ్య ఏటా పెరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భౌ బోయ్!

శస్త్రచికిత్స తర్వాత వదిలేస్తున్నారు..

వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్థానికులు ఫిర్యాదు చేస్తే వెటర్నరీ సిబ్బంది వచ్చి, వాటిని తీసుకెళ్తున్నారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స నిర్వహించి, మళ్లీ అక్కడే వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

19 ప్రమాదకర వ్యాధులు..

కుక్క కాటుతో 19 రకాల వ్యాధులు వస్తాయని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. రేబిస్, మెదడు వాపు, బ్రూసెల్లోసిస్, క్షయ, సాల్మొనెల్లోసిస్, లెప్టోస్పైరిస్, ప్లేగు, బర్డ్ ఫ్లూ, ఆంత్రాక్స్ తదితర వ్యాధులు సోకే ప్రమాదముంది.

వేసవి తాపాన్ని తట్టుకోలేక..

వేసవిలో ఉక్కపోత వల్ల జంతువుల్లోనూ ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు అంటున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక కొన్ని శునకాలు కనిపించిన వారిని కరిచేందుకు ప్రయత్నించడం, వాటి జోలికి వెళ్తే మరింతగా ఎగబడి తీవ్రంగా గాయపర్చడం చేస్తాయి. ఇటీవల వీధి కుక్కలతో పాటు పెంపుడు కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇళ్లల్లో శునకాలను పెంచుకునేవారు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న కుక్క కాటు బాధితులు..

సాధారణ రోజుల్లో కంటే వేసవిలోనే కుక్క కాటు ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. బాధితుల సంఖ్య ఏటా పెరుగుతోంది. జిల్లాలో ప్రతీరోజు 20 మంది వరకు కుక్కకాటుకు గురవుతుండగా.. ప్రతీ నెల దాదాపు 20 మంది రేబిస్ బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రతీ నెల 700 మందికి పైగా రేబిస్ టీకాలు తీసుకుంటున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

రేబిస్ ప్రాణాంతకం..

అతి భయంకర, ప్రాణాంతక వ్యాధి రేబిస్. ఇది సోకిన కుక్క లాలాజలం ద్వారా రేబిస్ వైరస్ ఇతర ప్రాణుల శరీరంలోకి ప్రవేశిస్తుంది. సాధారణంగా పిచ్చికుక్క కరిచిన తర్వాత వారం రోజుల నుంచి రెండేళ్లలోపు ఎప్పుడైనా వ్యాధి లక్షణాలు కనిపించవచ్చు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి, జిల్లాలోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 6 పట్టణ ఆరోగ్య కేంద్రాలతోపాటు ప్రాథమిక ఉపకేంద్రాల్లో యాంటీ రెబిస్ వ్యాక్సిన్లు ఇస్తున్నారు.

వ్యాధిని ఇలా గుర్తించవచ్చు..

- రేబిస్ సోకిన కుక్కలు నాలుకను బయటకు చాపి, సొల్లుకారుస్తూ మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటాయి.
- కనిపించిన ప్రతీ వస్తువును చివరకు రాళ్లను కూడా కొరికేందుకు ప్రయత్నించడం, నడిచేటప్పుడు తడబడుతూ, తూలుతూ, తోక ఆడించలేని స్థితిలో ఉంటాయి.
- నోరు, గొంతు, కండరాలకు పక్షవాతం వచ్చి, కుక్క అరుపులో మార్పు వస్తుంది.
- చివరకు నీటిని కూడా తాగలేని స్థితిలో ఉంటూ.. ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారి, 5 నుంచి 7 రోజుల్లో మరణిస్తుంది.
- మనుషులకు రేబిస్ సోకితే దవడ, గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి, నీటిని తాగలేరు. రోగి నీటిని చూసినా, నీటి శబ్దం విన్నా భయకంపితులవుతారు. ఈ లక్షణాన్ని హైడ్రోఫోబియా అంటారు.
- వెటర్నరీ అధికారులకు ఫిర్యాదు చేస్తే శునకాలను తీసుకెళ్లి, రేబిస్ వ్యాక్సిన్ వేస్తారు.

పెట్ లవర్స్.. అలర్ట్

వేసవిలో పెట్ లవర్స్ అలర్ట్‌గా ఉండాలని వెటర్నరీ డాక్టర్లు సూచిస్తున్నారు. సరైన సమయంలో టీకాలు వేయించాలని, ఆహారం, తాగునీరు అందుబాటులో ఉంచాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. పెట్ డాగ్స్‌కు స్వేద గ్రంథులు లేకపోవడంతో వేసవిలో వాటి శరీరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీంతో అవి వడదెబ్బకు గురవుతాయి. శరీరంలో వేడి పెరిగినప్పుడు శునకాలు ఆయాస పడతాయి. వెంటనే చల్లని నీటితో తడపాలి లేదా తడి గుడ్డతో తుడవాలి. పెద్ద బ్రీడ్ డాగ్స్‌కి ఎలక్ట్రోలర్ పౌడర్ గానీ ఓఆర్ఎస్ గానీ ఇవ్వాలి. వడదెబ్బ తగిలితే జ్వరంతోపాటు వాంతులు, విరేచనాలు అవుతాయి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే డాక్టర్ వద్దకు తీసుకెళ్లి, ప్రథమ చికిత్స చేయించాలి.

కుక్కలకు చికిత్స చేస్తున్నాం



రేబిస్ వ్యాధి సోకకుండా పెంపుడు కుక్కలకు చికిత్స అందిస్తున్నాం. ప్రభుత్వపరంగా ఎలాంటి నిధులు అందడం లేదు. మెడిసిన్ తెచ్చుకుంటే చికిత్స అందించగలం.

– కిరణ్ కుమార్ రెడ్డి, సీనియర్ పశువైద్యుడు

కుక్కల బెడద ఎక్కువైంది



నగరంలోని ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు దర్శనమిస్తున్నాయి. రాత్రి పూట నడుచుకుంటూ వెళ్లేవారితో పాటు బైక్ మీద వెళ్లినా, సైకిల్ మీద వెళ్లినా వెంటపడి కరుస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– శ్యాంసుందర్, కరీంనగర్

నియంత్రణ చర్యలు చేపట్టాలి



కుక్కల బెడదను అరికట్టాలంటే వాటిని పట్టుకుని పునరుత్పత్తి జరగకుండా శస్త్రచికిత్సలు చేపట్టాలి. అలాగైతేనే కుక్కల సంఖ్యను తగ్గించే అవకాశం ఉంది. మున్సిపల్ కార్పొరేషన్, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– నగేశ్‌కుమార్, కరీంనగర్



క్లుప్తంగా

ముత్తారం వాగులో మొసలి కలకలం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని ముత్తారం వాగులో మొసలి సంచారం కలకలం సృష్టించింది. వాగు పక్కన శనివారం గొర్రెలను మేపుతుండగా ఓ మేకను పట్టేందుకు ప్రయత్నించిందని కాపరులు తెలిపారు. దానిపై ఎదురు దాడి చేయడంతో వాగులోకి వెళ్లిపోయిందన్నారు. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా వాగు వద్దకు చేరుకొని, పరిశీలించారు. మత్స్యకారులు, రైతులు వాగు దాటే క్రమంలో జాగ్రత్తగా ఉండాలని గ్రామంలో డప్పు చాటింపు వేయించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కరీంనగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ కరీంనగర్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ కరీముల్లా ఖాన్ తెలిపారు. కరీంనగర్ పట్టణంలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12 మందిని శనివారం కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరిలో ఇద్దరికి 7 రోజుల జైలుశిక్ష, రూ.4,500 జరిమానా, మిగతావారికి రూ.16 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని పేర్కొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): ఓ యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. హనుమకొండవాసి సుమంత్ జమ్మికుంట పట్టణానికి చెందిన ఓ యువతి ఇంటర్ బ్యాచ్‌మేట్. ఇన్‌స్టాగామ్‌లో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి, అసభ్యంగా, అమానించేలా ఆమె అన్నయ్యకు మెస్సేజ్ చేశాడు. దీంతో తరచూ వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

కామారెడ్డి క్రైం: సిరిసిల్ల జిల్లా వీర్నపల్లికి చెందిన ఓ యువతి కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 3న కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చిన యువతి, కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకి వెళ్లిపోయిందన్నారు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కోర్కల్‌వాసిపై చీటింగ్ కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): ఓ సీడ్ కంపనీలో పని చేసి, రూ.5 లక్షలతోపాటు సీడ్ చీటింగ్‌కు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కనగర్తికి చెందిన మేరుగు చేరాలు న్యూ జీన్స్ సీడ్ కంపనీలో, అతని కింద జమ్మికుంట పట్టణంలో ఉంటున్న వీణవంక మండలంలోని కోర్కల్‌వాసి నల్లగొని కుమారస్వామి పని చేస్తున్నారు. అయితే, చేరాలు కంపనీ మేనేజర్ సింధూరి శ్రీనివాస్ ద్వారా కుమారస్వామి బ్యాంక్ అకౌంట్‌కు గత జనవరి 1న రూ.50 వేలు, 12న రూ.4.50 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించాడు. కుమారస్వామి ఆరు నెలలపాటు సర్వీస్ అందించి, రైతుల నుంచి సేకరించిన సీడ్‌ను కంపనీకి తెలియకుండా మరో కంపనీకి విక్రయించాడు. దీంతో అతనిపై చర్య తీసుకోవాలని కోరుతూ చేరాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చీటింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎన్నికల్లో కలెక్టరేట్ కీలకం

- ఓటరు చైతన్యం నుంచి ఓట్ల లెక్కింపు వరకు..
- పర్యవేక్షణ అంతా ఇక్కడి నుంచే..
- లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారుల కృషి
- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాలు



కరీంనగర్ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్ పరిపాలనకు కేంద్రమన్న విషయం తెలిసిందే. ఇక, ఎన్నికలొచ్చినా కలెక్టరేటే కీలకం. ఎలక్షన్‌కు సమాయత్తమవడం నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఇందులోని కీలక విభాగాలే ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోంది. ఓటరు చైతన్యం నుంచి ఓటేసే వరకు, పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతుల కల్పన, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం, తర్వాత ఓట్ల లెక్కింపు వరకు ఇలా ఎన్నో దశలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. మరోవైపు అక్రమాలను నిరోధిస్తూ ప్రశాంత వాతావరణంపై దృష్టిసారించాలి. వీటన్నింటికి సంబంధించి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి ఒక్కో నోడల్ అధికారిని నియమించారు. అన్ని విభాగాల బాధ్యత కలెక్టరేట్‌దే.

మానవ వనరుల విభాగం: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూరు, వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. పోలింగ్ రోజు ఎవరు ఎక్కడ విధులు నిర్వర్తించాలనేది మానవ వనరుల విభాగం నిర్ణయిస్తుంది. జిల్లాలో పే స్కేల్‌ను పరిగణలోకి తీసుకొని, వివిధ స్థాయిల్లో అధికారులను నియమించింది.

శిక్షణ : ఎన్నికల నిర్వహణపై ఉద్యోగులకు స్పష్టమైన అవగాహన కల్పించడమే ఈ విభాగం ప్రధాన విధి. నియమావళి అమలుపై శిక్షణనిచ్చారు.

సామగ్రి పంపిణీ : ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి గుర్తించడం, వాటిని సమకూర్చుకోవడం వంటి వాటికి ఈ విభాగం పని చేస్తుంది.

రవాణా సౌకర్యం : పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితోపాటు సామగ్రి రవాణా చేయడమే దీని పని. జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, ఈవీఎంలు, పోలీసులను సకాలంలో చేర్చడం ఈ విభాగం విధి. ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు చేర్చడంలోనూ భాగస్వామ్యమవుతుంది.

ఈవీఎంల నిర్వహణ : ఓటింగ్‌లో కీలకమైన ఈవీఎంలను కేంద్రాలకు చేర్చడం నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత స్ట్రాంగ్‌రూంలలో భద్రపరుస్తారు. వీటిని నిర్వహణను ఈ విభాగం చూస్తుంది.

ప్రవర్తనా నియమావళి : రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఈ విభాగం దృష్టి పెడుతుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది.

ఫిర్యాదులపై స్పందన : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఈ విభాగం స్పందిస్తుంది. డయల్ 1950, సీ–విజిల్, సువిధ యాప్‌ల వంటి వాటికి వచ్చే ఫిర్యాదులను రికార్డు చేసుకొని, పరిష్కరిస్తుంది.

పోస్టల్ బ్యాలెట్ : జిల్లా వ్యాప్తంగా పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారంతా ఓటేసేలా ఈ విభాగం పని చేస్తుంది.

చైతన్యం : ఓటుహక్కు వినియోగంపై చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ విభాగం పని చేస్తుంది. పోలింగ్ తక్కువ నమోదైన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఓటర్లకు ఓటుహక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తారు.

శాంతిభద్రతల పరిరక్షణ : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందే గుర్తించి, వాటిపై నిఘా పెట్టడం, ఆయుధాలు ఉన్నవారి వివరాల సేకరణ తదితర కార్యకలాపాలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది.

ఐటీ, కంప్యూటరైజేషన్ : సాంకేతిక అంశాలపై ఈ విభాగం పని చేస్తుంది. యాప్‌ల పని తీరు, వాటి నిర్వహణను పర్యవేక్షిస్తుంది. సాఫ్ట్‌వేర్ సమస్యలను పరిష్కరిస్తుంది.

వ్యయ నిర్ధారణ : అభ్యర్థుల ఖర్చులను లెక్కించటానికి ఈ విభాగం పని చేస్తుంది. సభలు, సమావేశాలు తదితరాలకు చేసిన వ్యయాన్ని వారి ఖర్చుల్లో చూపిస్తుంది. వాటిని వీడియో, సీడీల రూపంలో ఎన్నికల సంఘానికి పంపిస్తుంది.


ప్రసార సాధనాలపై పర్యవేక్షణ : మీడియాలో ప్రసారం, ప్రచురితమయ్యే వార్తలను ఎప్పటికప్పుడు గమనిస్తూ నియమావళికి విరుద్ధంగా ఉన్న వాటిని ఈ విభాగం గుర్తిస్తుంది.

నవ్వండి.. నవ్వించండి



స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ద్వారా నవ్వులు పూయిస్తున్న మేజిక్ రాజా (ఫైల్)

- హాస్యంతో మానసిక ప్రశాంతత
- ఒక్క చిరునవ్వుతో సమస్యలు దూరం
- నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం



లాఫింగ్ బుద్ధ

కోల్‌సిటీ(రామగుండం): నవ్వడం ఒక భోగం.. నవ్వించడం ఒక యోగం.. నవ్వకపోవడం ఒక రోగం॥ అన్నారు ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు దివంగత జంధ్యాల. అందుకే నవ్వండి.. నవ్వించండి.. నలుగురికీ మీ నవ్వును పంచండి. జీవితంలో హాస్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. నవ్వుతూ బతకాలని పెద్దలు ఊరికే చెప్పలేదు. మానసిక ఒత్తిడిని తగ్గించి, ఆయుష్షును పెంచేదే హాస్యం. అందుకే ప్రతిఒక్కరూ రోజులో కనీసం అరగంట అయినా నవ్వకపోతే.. అనారోగ్యానికి గురవుతారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. యాంత్రిక జీవనంలో నవ్వడం మరిచిపోతున్నారు. ప్రతీ ఏడాది మే నెలలో మొదటి ఆదివారం ×ప్రపంచ నవ్వుల దినోత్సవం॥ జరుపుకుంటున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

నవ్వుల దినోత్సవ నేపథ్యం..

వరల్డ్ వైడ్ లాఫర్స్ మెగా మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకులు 1998లో లాఫర్స్కో సమావేశం నిర్వహించారు. దీనికి సుమారు 12 వేల మంది హాజరుకావడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైంది. హాస్య ప్రాధాన్యతను గ్రహించిన నిర్వాహకులు, ఏటా మే నెల మొదటి ఆదివారం నవ్వుల దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించారు. ప్రపంచ వ్యాప్తంగా 10 వేలకు పైగా లాఫింగ్ క్లబ్బులు ఉన్నాయని అంచనా.

అనేక లాభాలు..

నవ్వు మనలో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుందని వైద్యులు చెబుతున్నారు. బాక్టీరియా, వైరస్ వంటివి శరీరంపై దాడి చేస్తే వాటిని ఎదుర్కొనే శక్తి దీనికి ఉంటుందని అంటున్నారు. రోగులు కనీసం రోజుకు ఓ గంటపాటు కడుపుబ్బా నవ్వగలిగితే మందుల అవసరం తగ్గుతుందని హాస్య పండితులు సూచిస్తున్నారు.

గోదావరిఖనిలో లాఫింగ్ క్లబ్..

గోదావరిఖనిలో 18 ఏళ్ల క్రితం స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ఏర్పడింది. ఇది క్లబ్ నవ్వులు పూయించడంతోపాటు అనేక సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. దీని స్ఫూర్తితోనే జగిత్యాల, కరీంనగర్, మెట్‌పల్లిల్లో లాఫింగ్ క్లబ్‌లు వెలిశాయి. ఉమ్మడి జిల్లాతోపాటు వరంగల్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లోనూ స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ హాస్యం పండించింది. ఒత్తిడితో సతమతమ్యే వాళ్లను నవ్వించి, సంతోషంగా ఉంచేలా సేవలందిస్తోంది. ఎలాంటి ఫీజు తీసుకోకుండా ఉచితంగా క్లబ్‌లో సభ్యత్వం ఇచ్చి, నవ్వులు పంచుతోంది.

ఒత్తిడి లేకుండా జీవిస్తారు



నవ్వుతూ, నవ్విస్తూ పని చేసేవాళ్లు ఒత్తిడి లేకుండా జీవిస్తారు. మా స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ద్వారా అనేక మంది కడుపుబ్బా నవ్విస్తున్నారు. కరోనా కాలం నుంచి సోషల్ మీడియా వేదికగా నవ్వులు పంచుతున్నాం.

– మేజిక్ రాజా, స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు, గోదావరిఖని

మనసారా నవ్వండి



సైడ్ ఎఫెక్ట్స్ లేని దివ్యౌషధం నవ్వు. చిరునవ్వుతో ఏదైనా సాధించవచ్చు. మనసారా నవ్వండి. మేము స్మైల్ ప్లీజ్ వాట్సాప్ గ్రూప్ ద్వారా నవ్వులు పంచుతున్నాం. నవ్వుకు మంచిన వ్యాయామం మరొకటి లేదు.

– చంద్రపాల్, లాఫింగ్ క్లబ్ కార్యదర్శి, గోదావరిఖని

మోదీ పాలనలో ధనవంతులకే మేలు

- విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి రంగాలను నిర్లక్ష్యం చేశారు..
- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకటనారాయణ

కరీంనగర్ కల్చరల్: విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి రంగాలను ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలనను అమలు చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కుబేరులకు ధనరాశులు సమకూర్చుతూ దేశంలో 162 మంది బిలియనీర్స్‌ను తయారు చేసిన కీర్తి మోదీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ కారణంగా చిరు వ్యాపార వ్యవస్థలు విధ్వంసానికి గురయ్యాయని పేర్కొన్నారు. మోదీ పాలనలో అదానీ, అంబానీ వంటి ధనవంతులకే మేలు జరిగిందన్నారు. వేలాది డిగ్రీ కళాశాలలు, 450కి పైగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు పదేళ్లుగా కేంద్రం చిల్లి గవ్వ చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యాలయాలకు లక్షల రూపాయల ఫీజులు చెల్లించి, పట్టాలు పొందిన యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభించని దేశాన్ని సంపన్న దేశమని ఎలా అంటారని ప్రశ్నించారు. పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. జనగణన చేయని మోదీని ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. డాక్టర్ నీలం సంపత్‌కుమార్, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, డాక్టర్ వంగల సుధాకర్ తదితరులున్నారు.

రెట్టింపు డబ్బులిస్తామని మోసం

కథలాపూర్(వేములవాడ): అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి, ఎంత డబ్బు చెల్లిస్తే దానికి రెట్టింపు ఇస్తామని ఆశ చూపడంతో ఓ యువకుడు మోసపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. కథలాపూర్‌కు చెందిన యువకుడికి అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి, రెట్టింపు డబ్బు సంపాదించుకోవచ్చని చెప్పాడు. దీనికి అతను అంగీకరించి, తొలుత రూ.10 వేలు పంపించాడు. వెంటనే ఆ యువకుడి అకౌంట్‌లో రూ.20 వేలు క్రెడిట్ అయ్యాయి. మరోసారి రూ.50 వేలు పంపించగా రూ.65 వేలు వచ్చాయి. తర్వాత అవతలి వ్యక్తి పలుమార్లు ఓటీపీలు పంపించడంతో ఇతను చెబుతూ వెళ్లాడు. దీంతో గత నాలుగు రోజుల్లో ఆ యువకుడి అకౌంట్‌లోని రూ.2.96 లక్షలు పోయాయి. బాధితుడు అపరిచిత వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ఆఫ్ వచ్చింది. తాను మోసపోయానని గ్రహించిన యువకుడు శనివారం పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి, ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సైబర్ క్రైం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ కేసులో ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం: తీసుకున్న అప్పు తీర్చకపోగా.. ఆ మొత్తానికి వేరొకరికి చెందిన ఇంటి స్థలాన్ని అసలు యజమానికి బదులుగా మరో వ్యక్తిని చూపించి, రిజిస్ట్రేషన్ చేశారు.. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని మంగళపల్లికి చెందిన గంప రమాదేవి బతుకుదెరువు నిమిత్తం కరీంనగర్ వచ్చి, కిరాణా షాపు నిర్వహిస్తోంది. ఆమె వద్ద నుంచి స్థానికుడు దేవసాని శ్రవణ్‌కుమార్ తన బంధువైన గుంటుకల తిరుపతికి రూ.2 లక్షలు ఇప్పించాడు. తర్వాత రమాదేవి తన డబ్బులు ఇవ్వాలని శ్రవణ్‌కుమార్, తిరుపతిలపై ఒత్తిడి తీసుకువచ్చింది. దీంతో వారు తీగలగుట్టపల్లెలోని పటేల్ సుధీర్‌రెడ్డికి చెందిన భూమిని ఆమెకు చూపించి, కొనుగోలు చేయాలని రూ.15 లక్షలు మాట్లాడుకున్నారు. రమాదేవి తనకు రావాల్సిన రూ.2 లక్షలు ఆపుకొని, మిగతా రూ.13 లక్షలు ఇచ్చింది. కానీ, శ్రవణ్‌కుమార్, తిరుపతిలు రాంనగర్‌కు చెందిన పోరండ్ల శ్రీనివాస్‌ను అసలు భూ యజమాని సుధీర్‌రెడ్డిగా చూపించి, తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు. రమాదేవి 2021లో తనకు రిజిస్ట్రేషన్ చేసిన ప్లాటులో బేస్‌మెంట్ నిర్మించుకుందామని వెళ్లగా అక్కడికి భోగ నవీన్ వచ్చాడు. ఇది తన ప్లాట్ అని డాక్యుమెంట్ చూపించగా అందులో పటేల్ సుధీర్‌రెడ్డి అమ్మినట్లుగా ఉంది. దీంతో రమాదేవి తనకు జరిగిన మోసంపై కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి, శ్రవణ్‌కుమార్, తిరుపతిలను శనివారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో కరీంనగర్ జైలుకు తరలించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి పట్టివేత

కోనరావుపేట(వేములవాడ): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. కోనరావుపేట మండలం కొలనూర్–మర్తనపేట గ్రామాల మధ్య శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించాడంతో ఆపి, తనిఖీ చేశామని పేర్కొన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద 75 గ్రాముల గంజాయి లభించినట్లు సమాచారం.

అగ్నిమాపక సిబ్బందివి ప్రమాదకర విధులు

- ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి



అగ్నిమాపక సిబ్బందిని సన్మానిస్తున్న శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యులు

కరీంనగర్ క్రైం: అగ్నిమాపక సిబ్బందివి ప్రమాదకర విధులని, అగ్ని ప్రమాదాల్లో ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించడానికి వారు ఎంతగానో శ్రమిస్తారని ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లోని ఉమ్మడి జిల్లా అగ్నిమాపక దళ కార్యాలయంలో శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా–2023 సంయుక్తంగా అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న అగ్ని ప్రమాదాల నుంచి పెద్ద కార్చిచ్చుల వరకు ఎగిసిపడుతున్న మంటలను ధైర్యంగా ఆర్పడంలో కొంతమంది సిబ్బంది ప్రాణాలు కూడా త్యాగం చేశారని తెలిపారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో విధులు నిర్వహించే ఫైర్ సిబ్బంది తిరిగి కార్యాలయానికి వస్తారన్న నమ్మకం కూడా ఉండదన్నారు. అనంతరం ఆయనతోపాటు సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు ఇనుగుర్తి రమేశ్, వడకాపురం జగదీశ్వరాచారి, మిట్టపల్లి మహేందర్, కోట సత్యం, లక్ష్మారెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై 'ఉపాధి' కూలీ మృతి



సత్తయ్య (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని బస్వాపూర్‌కు చెందిన పొన్నం సత్తయ్య(70) అస్వస్థతకు గురై, మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్య తనకున్న ఎకరన్నర భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉండటంతో ప్రతీరోజు పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శనివారం గ్రామంలోని చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులకు హాజరై, తిరిగి ఇంటికి వెళ్తుండగా అస్వస్థతకు గురై, కిందపడిపోయాడు. స్థానికులు పరిశీలించగా అప్పటికే చనిపోయాడు. మృతుడికి భార్య ప్రమీల, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



ఓదెలు మృతదేహం

రామగుండం: అంతర్గాం మండలంలోని పెద్దంపేటకు చెందిన మిర్యాల ఓదెలు చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై వెంకట్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఓదెలు ఈ నెల 1న రామగుండం నుంచి పెద్దంపేటకు ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపుతప్పి, మట్టి కుప్పను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అతని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి తల్లి, ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య



ఎల్లయ్య (ఫైల్)



రాజేశ్వరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మధుసూదన్‌రావు

చందుర్తి(వేములవాడ): ఆలనాపాలన చూసేవారు లేరు.. ఒంటరితనాన్ని భరించలేకపోయాడు.. చివరికి తనువు చాలించాడు చందుర్తి మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన కొమ్ము ఎల్లయ్య(70). స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లయ్య భార్య 40 ఏళ్ల క్రితమే ఆయను వదిలిపెట్టి వెళ్లిపోయింది. అప్పటినుంచి ఒంటరిగా ఉంటున్నాడు. తనకున్న భూమిలో కొంత అన్న కుమారులకు విక్రయించగా, మిగతాది తనను పోషిస్తారని వారికే ఇచ్చాడు. ఈ క్రమంలో 10 రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వెతికినా ఆచూకీ లభించకపోవడంలో ఆయన అన్న కుమారులు గత నెల 29న చందుర్తి పోలీసులను ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా, శనివారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గ్రామ శివారులోని గొండ్ల గుట్టకు తునికాకు సేకరణ కోసం వెళ్లారు. అక్కడ ఓ చెట్టుకు వేలాడుతూ కుళ్లిన మృతదేహం కనిపించింది. దగ్గరికి వెళ్లి అది ఎల్లయ్యదేనని గుర్తించారు. బాధిత కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, అక్కడే పోస్టుమార్టం చేయించి, దహన సంస్కారాలు జరిగేలా చూశారు.

ఎవరికీ దొరకకుండా చచ్చిపోతా అనేవాడు..

ఎల్లయ్య తాను ఒంటరితనాన్ని భరించలేకపోతున్నానని గ్రామ చావడి, హోటల్ వద్ద చెప్పేవాడని స్థానిక వృద్ధులు తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లిపోయి, ఎవరికీ దొరకకుండా చచ్చిపోతానని అనేవాడన్నారు. అన్నంత పని చేశాడని పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..

ముత్తారం(మంథని): మండలంలోని పారుపల్లికి చెందిన జెల్ల రాజేశ్వరి(25) ఆత్మహత్య చేసుకుందని ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజేశ్వరి కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. ఆస్పత్రుల్లో చూపించుకొని, మందులు వాడినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జగిత్యాలలో భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి..

జగిత్యాల క్రైం: భార్య కాపురానికి రావడం లేదని జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన బింగి నవీన్(35) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నవీన్‌కు ఏడేళ్ల క్రితం గోదావరిఖనికి చెందిన జ్యోత్స్నతో వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. ఇటీవల దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో జ్యోత్స్న పుట్టింటికి వెళ్లిపోయింది. నవీన్ ఆమెను తీసుకొచ్చేందుకు వెళ్లగా రానని చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన అతను శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం



దేవవ్వ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన బాధ దేవవ్వ(71) ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. దేవవ్వకు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. అంతేకాకుండా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించుకొని, మందులు వాడినా నయం కాలేదు. ఈ క్రమంలో గత శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రయినా తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆమె కోసం వెతకడం ప్రారంభించారు. శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనక ఉన్న వ్యవసాయ బావిలో దేవవ్వ మృతదేహం కనిపించింది. దేవవ్వ భర్త బాలయ్య ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతురాలికి కుమారుడు లింగం, కూతురు లక్ష్మి ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో కోరుట్ల యువకుడు..



కల్యాణ్ (ఫైల్)

కోరుట్ల: పట్టణానికి చెందిన కటుకం కల్యాణ్(24) హైదరాబాద్‌లోని ఓ లాడ్జిలో శుక్రవారం రాత్రి ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకున్నాడని అతని కుటుంబసభ్యులు తెలిపారు. కోరుట్ల పట్టణంలోని వేములవాడ రోడ్డులో నివాసం ఉండే మహేశ్–పద్మ దంపతుల కుమారుడైన కల్యాణ్ డిగ్రీ పూర్తి చేసి, హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
ఆదివారం ॥ 5-5-2024


ప్రజక్తా కోలి


కుష కపిల


ప్రశస్తి సింగ్

మీ నవ్వుల చల్లదనాన్ని మంచుకొండ అప్పడిగింది...


నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

ఒకరు జోక్ వేస్తే నవ్వడం చాలా వీజీ. నవ్వించడం మాత్రం నవ్వినంత ఈజీ కాదు. టోటల్‌గా చెప్పొచ్చేదేమిటంటే... నవ్వించడం అనేది అత్యంత కష్టతరమైన టాస్క్. ఈ నవ్వుల మహారాణులు మాత్రం అవలీలగా నవ్వులు పూయిస్తూ సోషల్ మీడియాలో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

నిఫ్ట్ గ్రాడ్యుయేట్ అయిన కుష కపిల బిల్లీ మసి, సౌత్ ఢిల్లీ గర్ల్స్‌లాంటి క్యారెక్టర్లతో నవ్వుల వర్షం కురిపిస్తోంది. ఆమెకు 1.6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. నిత్యజీవిత సంఘటనల ఆధారంగా ఢిల్లీకి చెందిన డాలీసింగ్ కామెడీని మేడ్ ఈజీ చేసింది. ముంబైకి చెందిన ప్రజక్తా కోలి కామెడీ వీడియోలు మోస్ట్ పాపులర్ అయ్యాయి. అబ్జర్వేషనల్ కామెడీకి ఆమె వీడియోలు అద్దం పడతాయి. కోలికి యూట్యూబ్‌లో 6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. స్టాండ్–అప్ కమెడియన్‌గా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది ప్రశస్తి సింగ్. అమెజాన్ ప్రైమ్ వీడియో సిరీస్ 'కామిక్‌స్థాన్' సూపర్ హిట్ అయింది. ఎంబీఏ చేసిన ప్రశస్తి 'నవ్వించడం' తన ప్యాషన్ అంటోంది. వీరు మాత్రమే కాదు కనీజ్ సుర్క, శ్రిష్టి దీక్షిత్, నిహారిక ఎన్ఎం, సుప్రియ జోషి, సుముఖి సురేష్, ఐశ్వర్య మోహన్‌రాజ్, సుమైర... లాంటి ఎంతో మంది నవ్వుల ప్రపంచంలో మహారాణులుగా వెలిగిపోతున్నారు.

వైరల్

సిగ్నల్ నీడలో



బతుకు గడవాలంటే రోడ్డు మీదకు రాక తప్పదు. వస్తే భయంకరమైన ఎండ. దాంతోపాటు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర వేచి ఉండాల్సిన బాధ. అందుకే పాండిచ్చేరి ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్ ఏర్పాటు చేసింది. వీటిని ఒక స్కూటరిస్ట్ 'ఎక్స్'లో షేర్ చేశాడు. వైరల్ అయిన ఈ పందిళ్లను చూసి చాలా మంది తమ నగరాల్లో కూడా ఇలా జరిగితే బాగుండని కోరుకుంటున్నారు.

మన దేశంలో ఎండలు విపరీతమవడం గతంలో కూడా ఉంది. సాధారణంగా మైదానప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియస్ దాటితే వడగాడ్పు ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. 2016లో జోధ్‌పూర్‌లో 51 డిగ్రీల రికార్డు టెంపరేచర్ నమోదైంది. 2019లో లాంగెస్ట్ హీట్‌వేవ్‌ను దేశం చూసింది. 32 రోజుల పాటు సాగిన వడగాడ్పులకు ఆంధ్రప్రదేశ్ అల్లాడిపోయింది విదర్భ, రాజస్థాన్ కాకుండా. అందుకే మన దేశంలో మే నెలను చూసి జనం గడగడ వొణుకుతారు. బయటికొస్తే వాహనదారులకు నిలువ నీడ ఉండదు. ఇలాంటి సమయంలో పాండిచ్చేరిలో ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్స్ ఏర్పాటు చేసింది. దీని వల్ల ఎండలో తిరిగే వారికి నీడ కింద ఉపశమనం దొరికినట్టవుతుంది... దాంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్‌ను పాటించినట్టవుతుంది. ఒక వాహనదారుడు ఇన్‌స్టాలో రిలీజ్ చేసిన పాండిచ్చేరి గ్రీన్‌షేడ్స్‌ను చూసి ప్రతి ఒక్కరూ మా నగరాల్లో కూడా ఇలాంటివి ఏర్పాటు చేస్తే బాగుండు అంటున్నారు. ప్రభుత్వాలు వింటే బాగుండు.

నీటి పిట్టలు



'స్విమింగ్ పూల్ అంటే ఎలా ఉంటుంది సార్?'
అని అడిగారా పల్లెటూరి స్కూల్ పిల్లలు.
స్కూల్ ప్రిన్సిపల్‌కి చివుక్కుమంది.
ఎండల్లో జలకాలాడే చిన్న సరదా కూడా
తన స్కూల్ పిల్లలకు లేకపోతే ఎలా అనుకున్నాడు.
ఆ తర్వాత అతడేం చేశాడు?
పిల్లలు నీటి పిట్టలు ఎలా అయ్యారు?
వైరలైన ఈ వివరం వినండి.

ఉత్తరప్రదేశ్‌లో అత్తర్ల తయారీకి వాసికెక్కిన కన్నౌజ్‌కు పక్కనే ఉండే తిర్వా అనే ఊరిలోని ఒక ప్రయివేటు స్కూల్ విద్యార్థులకు స్విమ్మింగ్ పూల్ ఎలా ఉంటుందో తెలియదు. 'వేసవి కాలంలో నగరాల్లో డబ్బున్నవాళ్లు స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లి ఈత కొడతారు' అని స్కూల్ ప్రిన్సిపాల్ వైభవ్ సింగ్ పిల్లలకు మాటవరసకు చెప్తే పిల్లలు 'అదెలా ఉంటుంది సార్' అనడిగారు. 'మేమెందుకు అలాంటి పూల్‌లో ఈత కొట్టకూడదు' అనంటే మన చుట్టుపక్కల పూల్స్ లేవు అని ప్రిన్సిపాల్ అన్నాడు. కాని అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఒక క్లాస్‌రూమ్‌లో నీళ్లు నింపి ఇదే పూల్ అన్నాడు. తల్లిదండ్రుల అనుమతి అడిగి స్కూల్ అయ్యే సమయానికి అందులో కేరింతలు కొట్టే అవకాశం ఇచ్చాడు. ఇంకేముంది... పిల్లలకు హుషారే హుషారు. స్కూల్ ఎగ్గొట్టడంలో ఘనాపాఠీలైన పిల్లలు కూడా పలక తీసుకొని పరిగెత్తుకుంటూ వస్తున్నారు. ఊళ్లోని తల్లిదండ్రులు కూడా వచ్చి పిల్లలు నీళ్లల్లో కేరింతలు కొడుతుంటే చూసి సంతోషపడుతున్నారు. ఈ వీడియో వైరల్ అయ్యింది.

నేడే చూడండి... గుర్రం గారి డ్యాన్స్



'కొత్త బట్టలు కుట్టిస్తారు. గుర్రపు స్వారీ చేయిస్తారు' అని పెళ్లికుమారుడి గురించి మురిపెంగా చెబుతుంది ఓ సిన్మా పాట. ఈ పాట మాట ఎలా ఉన్నా కొన్ని పెళ్లి ఊరేగింపులలో గుర్రం పరేషాన్ చేస్తుంటుంది. లక్నోలో ఒక పెళ్లి ఊరేగింపులో బాంబుల మోత భరించలేక 'ఐ డోన్ట్ లైక్ ఇట్' అంటూ గుర్రం పరుగులు తీసింది. గుర్రంపై ఉన్న పెళ్లికుమారుడు భయంతో లబోదిబో అన్నాడు. ఇక తాజా విషయానికి ఇస్తే... ఒక పెళ్లి ఊరేగింపులో ఒక కుర్రాడు డ్యాన్స్ చేస్తున్నాడు. లెక్క ప్రకారం అయితే పెళ్లి ఊరేగింపు గుర్రం ఇట్టి దృశ్యాలను మౌనంగా చూస్తుంది. మరి మన గుర్రానికి ఏమనిపించిందో తెలియదుగానీ ఆ డ్యాన్సర్‌కు తగినట్లు స్టెప్పులు వేయడం మొదలుపెట్టింది. గుర్రంపై కూర్చున్న వరుడి గుండెల్లో మెట్రో రైళ్లు పరుగెత్తడం మాట ఎలా ఉన్నా... అక్కడ ఉన్న జనాలకు గుర్రం డ్యాన్స్ తెగ నచ్చి ఈలలు వేయించింది. మనోజ్ పటేల్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

మేండలు బాబోయ్ మేండలు





కూల్ మీమ్స్


















హెల్త్

• చర్మంపై
వేసవి ఎండ ప్రభావం... జాగ్రత్తలు!



మనపై వేసవి ఎండల ప్రభావాలు ఎలా ఉన్నప్పటికీ... నేరుగా ప్రభావితం చేసేది చర్మాన్నే. ఎండ ప్రభావం ప్రత్యక్షంగా ఉండటంతో మేని రంగు మారడం, చర్మం కమిలిపోవడం వంటివి సహజం. ప్రధానంగా చిన్నపిల్లల్లో చెమటకాయలు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. వేసవి ఎండల్లో చర్మంపై చూపే దుష్ప్రభావాలూ, వాటి నివారణ, చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం...



వేసవిలో ఈ కింద పేర్కొన్న అనేక రకాల చర్మ సమస్యలు వచ్చే అవకాశముంది.

చెమటకాయలు (మిలీరియా)...
చెమటకాయలు ముఖ్యంగా పిల్లల్లోనూ, కొందరు పెద్దల్లో కూడా కనిపిస్తుంటాయి. వేడి వాతావరణంలో చర్మంపైన ఉండే స్వేదగ్రంథులు మూసుకుపోయి వాపు రావడం వల్ల వేసవిలో ఇవి వస్తుంటాయి. చర్మంపైన ఎర్రటి ర్యాష్‌లాగా కొన్నిసార్లు మాడినట్లుగా నలుపురంగులో కనిపిస్తుంటాయి. పిల్లల్లో చెమట గ్రంథులు పూర్తిగా ఎదగక పోవడం, వేడిమి, ఎండలో విపరీతంగా ఆడటం చెమటకాయలు రావడానికి ప్రధాన కారణాలు.

నివారణ / చికిత్స: చెమటకాయలు వచ్చినప్పుడు పిల్లలకు గాలి బాగా ఆడేలా వదులుగా ఉండే దుస్తులు (కాటన్‌వి అయితే మరీ మంచిది) ధరింపజేయాలి.
● గాఢత తక్కువగా ఉండే మైల్డ్ సబ్బులు వాడాలి. ● కాలమైన్ లోషన్ రాసుకోవడం మంచిది. ● పిల్లలు ఎండల్లో ఎక్కువగా ఆడకుండా జాగ్రత్త పడాలి. చికిత్సలో భాగంగా ప్రిక్లీ హీట్ పౌడర్ వాడాలి. తగ్గక పోతే ఎమోలియెంట్స్ అనే క్రీముల్ని డాక్టర్ సలహా మేరకు రాయాలి.

మంగుమచ్చలు/ మెలాస్మా...
చర్మానికి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం వల్ల చర్మంపైన ఉండే మెలనోసైట్స్ అనే కణాలు పెరిగి, చర్మం నల్ల బారుతుంది. ఈ పిగ్మెంటేషన్‌ను మెలాస్మా అంటారు.

జాగ్రత్తలు/ చికిత్స: పిగ్మెంటేషన్ ఉన్నవారు రోజూ రాత్రివేళ కోజిక్ యాసిడ్, ఆర్బ్యుటిన్, విటమిన్–సి ఉన్న క్రీములు రాసుకోవాలి. ● 40 ఎస్‌పీఎఫ్ కంటే ఎక్కువగా ఉన్న సన్‌స్క్రీన్‌ను ప్రతి మూడుగంటలకోసారి రాయాలి.

మొటిమలు ఎక్కువగా రావడం..
వేసవి వేడి వాతావరణంలో తేమ (హ్యుమిడిటీ) ఎక్కువగా ఉన్నప్పుడు మన చర్మంపై ఉండే సబేషియస్ గ్రంథులు ఎక్కువగా పనిచేసి, సీబమ్ అనే నూనె లాంటి ద్రవం స్రవిస్తుంది. అలాగే ముఖంపై ఉండే 'పైలో సబేషియస్ యూనిట్' అనే వ్యవస్థ చాలా చురుగ్గా పనిచేయడంతో చర్మంపై ఎక్కువ చెమట పట్టడంతో, సీబమ్ అనే నూనె లాంటి ద్రవాల స్రావాలతోనూ ఈ గ్రంథుల రంధ్రాలు మూసుకుపోతాయి. దాంతో అక్కడ బ్యాక్టీరియా పెరిగి ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఇలా ఈ సీజన్ మొటిమల ఎక్కువగా పెరగడానికి కారణమవుతుంటుంది.

నివారణ / చికిత్స : మొటిమల్ని ప్రేరేపించే అంశాల్లో చాక్లెట్లు, కాఫీలోని కెఫిన్ ప్రధానమైనది. అందుకే టీనేజీ పిల్లలకు కొవ్వులు, చక్కెర పాళ్లు తక్కువగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్నే ఇవ్వాలి. ఎవరికి వారు తాము తీసుకునే ఆహారాల్లో కొన్ని ఐటమ్స్ సెబేషియస్ గ్రంథులను ప్రేరేపించేవి అని గుర్తిస్తే వాటికి దూరంగా ఉండాలి. ఈ తరహా నివారణ చర్యల తర్వాత కూడా మొటిమలు తగ్గకపోతే అప్పుడు క్వాలిఫైడ్ డర్మటాలజిస్టును కలిసి వారి సూచన మేరకు క్లిండామైసిన్ అండ్ ఎడాపలిన్ కాంబినేషన్ ఉన్న క్రీమును ప్రతి రోజూ రాత్రివేళ రాసుకోవాలి. అప్పటికీ తగ్గక పోతే వైద్యుల సలహా మేరకు యాంటీబయాటిక్స్ కూడా వాడాల్సి ఉంటుంది.


డా. కె.ఎస్.ఎన్. రవితేజ
సీనియర్ డర్మటాలజిస్ట్ & కాస్మటాలజిస్ట్



ఈత జబ్బులతో జర భద్రం

ఒకప్పుడు వేసవి సెలవులు రాగానే ఎనిమిదీ పదేళ్ల పిల్లలంతా ఊళ్లలో బావులకు ఈతకు వెళ్లేవారు. ఇప్పుడా సంఖ్య కాస్త తగ్గినా ఇంకా అలా ఈతకెళ్లేవాళ్లు ఉండనే ఉన్నారు. పల్లెలూ, పట్టణాల పిల్లలైతే సెలవులు కాబట్టి దగ్గర్లోని సముద్ర తీరం దగ్గరికి స్నానాలకు వెళ్లడం, నదుల్లో, చెరువుల్లో ఈదులాడటం మామూలే. ఇక నగరవాసుల పిల్లలు స్విమ్మింగ్ క్లాసులంటూ ఈత నేర్చుకోడాలు ఈ సీజన్‌లోనే ఎక్కువ. దానికితోడు టబ్ బాత్‌లూ, అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో స్ప్లాష్ బాత్, కృత్రిమ కెరటాల్లో ఈదులాటలూ ఉంటాయి. అయితే ఈత సంబంధమైన వినోదక్రీడల్లో, వాటర్ స్పోర్ట్స్‌లో పిల్లలకు ప్రమాదాలు తెచ్చిపెట్టే ముప్పులు ఉండనే ఉంటాయి. అవేమిటో, వాటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం.

ఈత రానప్పుడు... అది స్విమ్మింగ్‌పూల్‌గానీ లేదా చెరువు, వాగు, నదిలో మునిగిపోయే ప్రమాదమే అన్నిటి కంటే పెద్ద ముప్పు. ఇలాంటి సందర్భాల్లో ఈత తెలిసినవారు తప్పక పక్కనే ఉండాలి. పిల్లవాడు మునిగిపోతున్నట్లు గమనించిన వెంటనే ఒడ్డుకు తీసుకువచ్చి సమతలంగా ఉండే ప్రదేశంలో పడుకోబెట్టాలి. కోలుకునేందుకు చేయాల్సిన పరిచర్యలివి...
● ప్రమాదానికి గురైన చిన్నారి తల పక్కకు ఉండేలా, ఎడమవైపు ఒరిగి ఉండేలా చూసుకోవాలి. ● ఛాతీని గమనిస్తూ, శ్వాస ఆడుతుందో లేదో చూడాలి. శ్వాస తీసుకోలేకపోతుంటే గదమ భాగం పైకి ఉండేలా చేసి, గొంతులో ఏదైనా అడ్డుగా ఉందేమో చూడాలి... ఉంటే ఆ అడ్డును తొలగించాలి.
● తర్వాత బోర్లా పడుకోబెట్టి వీపుపై మన రెండు అరచేతులు అనించి, బలంగా నొక్కాలి. దీనివల్ల ఊపిరితిత్తుల్లో ఏమైనా నీళ్లు ఉంటే బయటకు వెళ్లిపోతాయి. శ్వాసక్రియ మళ్లీ మొదలవుతుంది. ● కొందరు నీళ్లు తాగేస్తారు. అలాంటప్పుడు కడుపుపై విడతలవారీగా నొక్కుతూ నీళ్లు బయటకు వెళ్లేలా చేయాలి. దాంతో శ్వాసక్రియ తేలిగ్గా జరుగుతుంది. నోటితో గాలి ఊదేటప్పుడు పిల్లవాడి ముక్కు మూయాలి. మన నోరు పక్కకు తీసినప్పుడు ముక్కు తెరచి ఉంచాలి. ఈ రెండింటి మధ్య కొంత వ్యవధి ఇస్తూ ఒక క్రమపద్ధతిలో చేస్తుండాలి.
● ఆ తర్వాత వాళ్లను పొడిబట్టల్లోకి మార్చాలి.

ఇతర ఆరోగ్య సమస్యలు...

నీళ్ల విరేచనాలు (డయేరియా): ఈదుతున్న నీళ్లలో ఉండే ఈ–కొలై, షిజెల్లా, క్రిప్టోస్పోరీడియమ్, నోరో వైరస్ వంటి సూక్ష్మక్రిముల వల్ల నీళ్ల విరేచనాల సమస్య రావచ్చు. సమస్య తీవ్రతను బట్టి కొన్ని సందర్భాల్లో యాంటీబయాటిక్స్ వంటి మందులతో పాటు దేహద్రవాలను కోల్పోకుండానే, క్రిములను మాత్రం బయటకు పంపేలా చేసే విరేచనాలు కట్టుబడే మాత్రలు వాడాల్సి ఉంటుంది.

చెవిలో నొప్పి లేదా స్విమ్మర్స్ ఇయర్ : 'ఒటైటిస్ ఎక్స్‌టర్నా' అనే ఈ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లో చెవి నొప్పి, చెవిలో దురద, నీరుకారడం, చెవి ప్రాంతంలో వాపు కనిపిస్తాయి. దీని నివారణకు ఈత పూర్తి కాగానే తువ్వాలతో చెవుల్ని, ఇయర్ కెనాల్‌నూ పొడిగా మారేలా తుడవాలి. అప్పటికీ తగ్గపోతే డాక్టర్ సలహా మీద చెవుల్లో యాంటీబయాటిక్ చుక్కల మందులు వాడాలి. ఈ ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఈత సమయంలో ఇయర్ ప్లగ్స్ వాడటం మంచిది.

హాట్ టబ్ ర్యాష్: కలుషితమైన నీళ్లలో ఈదటం వల్ల చర్మానికి వచ్చే సమస్య ఇది. ర్యాష్ వచ్చినచోట చర్మం ఎర్రబారి దురద పెడుతుంటుంది. చర్మంపై రోమాంకురాల చివర్లలో చీముపొక్కుల్లా వస్తుంటాయి. స్విమ్‌సూట్ ధరించిన ప్రాంతాల్లో లక్షణాల తీవ్రత మరీ ఎక్కువ. ఈ సమస్య నివారణకు ఈత పూర్తయిన వెంటనే స్విమ్ సూట్ తొలగించి, సబ్బుతో శుభ్రంగా స్నానం చేయాలి.


కళ్లు ఎర్రబారడం : ఈత తర్వాత చాలామంది కళ్లు ఎర్రబారినట్టుగా ఉంటాయి. ఈదులాడే చోట అనేక రకాల మానవ కాలుష్యాలు, ఇతర రసాయనాల వల్ల నీళ్లు కలుషితం కావడమే ఇందుకు కారణం. ఒకవేళ స్విమ్మింగ్‌పూల్‌లో ఇలాంటి సమస్య వస్తే... ఆ నీటిని క్లోరినేషన్ ద్వారా డిస్–ఇన్‌ఫెక్ట్ చేయాల్సి ఉంటుంది. చెరువు, కొలను వంటి ఇతర వనరులైతే అలాంటి చోట ఈత కొట్టక పోవడమే మేలు.

సైనసైటిస్: నీటి కొలనులు, చెరువుల వంటి చోట్లలో ఈదులాడుతున్నప్పుడు మన తలలో ఉండే సైనస్ అనే ఖాళీ ప్రదేశాలలో నీరు చేరి, అక్కడ సూక్ష్మజీవులు పెరగడం వల్ల ముక్కు నుంచి స్రావాలు కారుతుండటం, ఒక్కోసారి కణతల వద్ద తలలో, చెవుల్లో నొప్పి రావడం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటప్పుడు డాక్టర్ సలహా మేరకు యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మాత్రలు వాడాల్సి రావచ్చు.



ఇతర ఇన్ఫెక్షన్లు : కొన్ని రకాల ఇన్ఫెక్షన్ల వల్ల జ్వరం, ఆకలి తగ్గడం, తలనొప్పి, తీవ్రమైన నిస్సత్తువ వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే పిల్లల ప్రైవేట్ పార్ట్స్ దగ్గర పిన్‌వార్మ్స్ వంటి ఇన్ఫెక్షన్లూ వచ్చే ప్రమాదముంది. కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తుల్లోకి కలుషితమైన నీరు ప్రవేశించడం వల్ల తీవ్రమైన దగ్గు లేదా శ్వాస సమస్యలు రావచ్చు.

ఈత సమస్యల నివారణ కోసం...
● పిల్లలు ఈతకొడుతున్నప్పుడు సీఆర్‌పీ వంటి ఫస్ట్ ఎయిడ్ పద్ధతులు, ఈదడం తెలిసిన పెద్దలు తప్పక పక్కనే ఉండి తీరాలి.
● ఈత ఎంతో ఆరోగ్యకరమైన వ్యాయామమైనప్పటికీ దాంతో వచ్చే సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించి, ఆ మేరకు వారు జాగ్రత్తలు తీసుకునేలా వాళ్లలో అవగాహన పెంచాలి. ● పిల్లలు ఈదులాడే కొలను, నదులు, చెరువులు శుభ్రంగానే ఉన్నాయని నిర్ధారణ చేసుకున్న తర్వాతే వారిని ఈతకు అనుమతించాలి. స్విమ్మింగ్‌పూల్ అయితే నిర్ణీత వ్యవధుల్లో ఈ నీటిని క్లోరిన్‌తో ట్రీట్ చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ● వీలైతే పిల్లల చెవుల్లోకి నీరు పోకుండా ఇయర్ ప్లగ్స్, కళ్లకు గాగుల్స్ వంటివి ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.


డా. ప్రవీణ్‌కుమార్ కులకర్ణి,
సీనియర్ ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

మెడి టిప్
వాటర్ కూలర్‌తో ఒకింత జాగ్రత్త!

చాలారోజుల తర్వాత వాడుతున్న వాటర్ కూలర్ విషయంలో ఒక్క జాగ్రత్త తప్పనిసరిగా పాటించి తీరాలి. అదేమిటంటే... వాటర్ కూలర్‌లో ఎంతోకొంత నీరు ఉండి, దాన్ని చాలారోజుల పాటు ఆన్ చేయకుండా ఉన్నప్పుడు ఆ వాటర్ కూలర్ మెష్‌లో ఉండే బ్యాక్టీరియాతో 'లీజియొనైర్స్ డిసీజ్' అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. లీజియొన్నెల్లా అనే బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి వల్ల లంగ్స్ ప్రభావితమవుతాయంటున్నారు డాక్టర్లు. అప్పటికే ఆస్తమా ఉన్న వారిలో ఈ 'లీజియొనైర్స్ డిసీజ్' మరింత ప్రమాదకరం కావచ్చంటూ హెచ్చరిస్తున్నారు. అందుకే కూలర్ వాడే ముందర ఒకసారి అందులోని పాత నీరంతా డ్రై అయిపోయేలా ఆన్ చేసి ఉంచాలి. ఆ తర్వాత కూడా ఒకసారి ఫ్రెష్‌గా మరికాసిని నీళ్లు పోసి, అవి కూడా పూర్తిగా ఇగిరిపోయేలా చేయాలి. అటు తర్వాత తాజాగా నీళ్లు పోసి, అప్పుడు వాడుకోవాలంటూ డాక్టర్లు సలహా ఇస్తున్నారు.

